క్లుప్తంగా

నేటి నుంచి పశువులకు గాలికుంటు నివారణ టీకా

ఖమ్మంరూరల్: మండలంలో నేటి నుంచి నవంబర్ 11 వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు మండల పశువైద్యుడు డాక్టర్ అనంతు హరీష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు ప్రతీ గ్రామానికి పశు వైద్య సిబ్బంది వస్తారని, రైతులు ఇంటి వద్దనే ఉండి తమ పశువులకు టీకాలు వేయించాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంరూరల్: మండలంలోని కోదాడ క్రాస్‌రోడ్‌లో గల సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు పార్ట్ టైం ప్రాతిపదికన బోటనీ బోధించుటకు మహిళా లెక్చరర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్‌శర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత పీజీలో 55 శాతం మార్కులు ఉండాలని, పీహెచ్‌డీ, నెట్ ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని, అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను జతచేసి ఈ నెల 18వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా కళాశాలలో అందించాలని తెలిపారు. స్క్రీనింగ్ టెస్ట్, డెమో ద్వారా ఉద్యోగ నియామకం ఉంటుందని సూచించారు.

అనారోగ్యంతో రిటైర్డ్ కుక్ మృతి

రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెంకు చెందిన రిటైర్డ్ హాస్టల్ కుక్ ఆర్.ప్రసాద్(67) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ప్రసాద్ మృతికి పలువురు సంతాపం ప్రకటించారు.

'రాయల' పరామర్శ

నేలకొండపల్లి: ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ నాయకురాలు చావా లలితమ్మ కుటుంబాన్ని సోమవారం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పరామర్శించారు. మండలంలోని గువ్వలగూడెంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు చావా లలితమ్మ దశ, దిన కర్మ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని, కాంగ్రెస్ సేవాదళ్ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు బోయిన వేణు, వంగూరి బాలాజీ, జిల్లపల్లి నాగేశ్వరరావు, అప్పారావు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీ ఎంపికపై అసంతృప్తి..

నేలకొండపల్లి: పట్టణ ఇందిరమ్మ కమిటీ ఎంపికపై అసంతృప్తి బట్టబయలైంది. పట్టణానికి చెందిన ఆ ముగ్గురు నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులే కమిటీలో పేర్లు రాసుకోవడంతో నాయకులు, కార్యకర్తలు భగ్గుమన్నారు. ఈమేరకు సోమవారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. పార్టీ సమావేశంలో పేర్లు చదివి వినిపించి నాయకులు సమావేశం నుంచి బయటకు వెళ్లారని నేలకొండపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు, సొసైటీ డైరెక్టర్ మైశా శంకర్ ఆరోపించారు. అన్ని సామాజిక వర్గాలకు చెందిన వారితో సమావేశం ఏర్పాటు చేసి కమిటీ ఏకగ్రీవంగా జరిగేలా చూడలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీటీసీ గుడిపాటి ముక్కంటి, మన్నె రవి, సత్యనారాయణ, కందిమళ్ల హరిబాబు, కొడిరెక్క వినోద్, శ్రీకాంత్, కైలాసపు వెంకటేష్, కె. మల్లయ్య, కడియాల నరేష్, ఐతన బోయిన శ్రీనివాస్, అంజిని తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	64	బచ్చలికూర	3
వంకాయ	36		20
బెండకాయ	30	పాలకూర	3
పచ్చిమిర్చి	56		20
కాకర	36	చుక్కకూర	3
బోడ కాకర	120		20
బీర	48	తోటకూర	3
దొండ	36		20
పొట్లకాయ	60	గోంగూర	5
చిక్కుడు	80		20
గోరుచిక్కుడు	48	మెంతికూర	2
క్యాబేజీ	30		20
క్యాలీఫ్లవర్	35	కొత్తిమీర	1
ఆలుగడ్డ	40		50
చామగడ్డ	48	పుదీన	1
క్యారెట్	64		25
క్యాప్సికం	70	-ఖమ్మం వ్యవసాయం	

తక్షణమే పరిష్కరించేలా..

- కేఎంసీ గ్రీవెన్స్‌లో అధికారులతో పాటు పాల్గొన్న సీఓలు
- ఫిర్యాదులను అక్కడే పరిష్కరించేలా ప్రత్యేక కార్యాచరణ
- విభాగాల వారీగా కౌంటర్లు


గ్రీవెన్స్‌కు వచ్చిన అర్జీదారుల సమస్య తెలుసుకుంటున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: పలు సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వారాల తరబడి అవి పరిష్కారం కాకపోవడంతో ప్రజావాణి (గ్రీవెన్స్)లో కమిషనర్‌ను కలిసి విన్నవించుకుంటున్నారు. దీంతో ఫిర్యాదుదారులు ఇచ్చిన వినతిపత్రాలను సత్వరమే పరిష్కరించేందుకు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. ఇక ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ఆయా విభాగాల అధికారులతో పాటు వారి విభాగానికి చెందిన కంప్యూటర్ ఆపరేటర్ (సీఓ) ల్యాప్‌టాప్‌తో కూర్చోవాలని ఆదేశించారు. గత వారమే ఈ ఆదేశాలను కమిషనర్ జారీ చేసినప్పటికీ ఒకటిరెండు విభాగాలు మాత్రమే తమ సీఓలను ప్రజావాణిలో కూర్చోబెట్టారు.

నెలల తరబడి..

ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి వారం రోజుల్లో వాటిని పరిష్కరించేలా అధికారులు ఆయా విభాగాలకు ఫిర్యాదులను బదలాయిస్తుంటారు. అయితే కేఎంసీలో నిర్వహించే ప్రజావాణికి వచ్చిన అనేక ఫిర్యాదులు పరిష్కారం కావడం లేదు. ఒకే సమస్యపై పలుమార్లు అర్జీదారులు కేఎంసీకి రావాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రధానంగా టౌన్ ప్లానింగ్ విభాగంకు సంబంధించి నెలలు, సంవత్సరాలు గడిచినా సమస్యకు అధికారులు పరిష్కారం చూపించడం లేదనే విమర్శలు ఉన్నాయి. కమిషనర్ ఆదేశించినా సమస్యను పరిష్కరించేందుకు టౌన్ ప్లానింగ్ అధికారులు విముఖత చూపుతారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇక రెవెన్యూలో చిన్నచిన్న సమస్యలపై కూడా ఇదే తంతు కొనసాగడంతో కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఐదు విభాగాలపై దృష్టి..

ప్రజావాణిలో టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, ఇంజనీరింగ్, బర్త్ అండ్ డెత్, పెన్షన్ విభాగాలకు సంబంధించి అత్యధిక ఫిర్యాదులు అందుతున్నాయి. గ్రీవెన్స్‌కు వచ్చే ఫిర్యాదుల్లో అనేకం అక్కడికక్కడే పరిష్కరించేవిగా ఉన్నాయని కమిషనర్ పరిశీలించి సంబంధించిన అధికారులతో పాటు సీఓలు పక్కనే కూర్చుని పరిష్కరించాలని ఆదేశించారు. గత సోమవారమే(7వ తేదీ) ఈ విధానం అమలు చేయాలని ఆదేశించగా.. వచ్చిన ఫిర్యాదు మరలా పునరావృతం కాకుండా పరిష్కారం చూపాలన్నారు.

స్పందించని అధికారులు..

గ్రీవెన్స్‌లో విభాగం పేరుతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకుని అధికారితో పాటు సీఓ కూర్చుని ఫిర్యాదులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అయితే సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో రెవెన్యూ, పెన్షన్ విభాగానికి చెందిన కంప్యూటర్ ఆపరేటర్లు మాత్రమే కూర్చొనగా.. జనన, మరణ విభాగానికి చెందిన సీఓలు కింద ప్రత్యేక కౌంటర్‌లో కూర్చోబెట్టారు. ఇక టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు మాత్రం వారి సీఓలను గ్రీవెన్స్‌కు పిలిపించకపోవడంతో కమిషనర్ అధికారులకు మరోసారి ఆదేశాలు జారీ చేశారు.


జనన, మరణ విభాగం సెల్‌లో సిబ్బంది

నిశితంగా పరిశీలిస్తూ..

గ్రీవెన్స్‌లో పలువురి నుంచి అర్జీలను స్వీకరించిన కమిషనర్ నిశితంగా పరిశీలించి వీలైతే పరిష్కరించేలా చేస్తున్నారు. తమ స్థలాన్ని ఆక్రమించారనే ఫిర్యాదుతో పలుమార్లు గ్రీవెన్స్‌కు వచ్చిన అర్జీదారులతో మాట్లాడి, డాక్యుమెంట్లను పరిశీలించాక రెండు వారాల్లో సమస్యకు పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. మొత్తం 11 ఫిర్యాదులు రాగా.. వాటిలో టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ విభాగలకు చెందినవి అధికంగా ఉన్నాయి.

కేఎంసీలో మెకానిక్ షెడ్ ఏర్పాటు..

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన పారిశుద్ధ్య వాహనాల మరమ్మతుల కోసం షెడ్‌ను ఏర్పాటు చేయించాలని అసిస్టెంట్ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులను కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. దీంతో కేఎంసీ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న షెడ్‌లో ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రణాళికలు చేస్తున్నారు. ఒక గాలి మిషన్ ఏర్పాటుతో పాటు ఇతర మరమ్మతులకు అవసరమైన ఏర్పాట్లకు చర్యలు చేపట్టారు. అవసరమైతే ఉన్న మెకానిక్‌కు అదనంగా మరో మెకానిక్‌ను నియమించుకోవాలని సూచించారు.

వైద్యాధికారుల తీరుపై నిరసన


వాగ్వాదం చేస్తున్న పేషెంట్ల బంధువులు

నేలకొండపల్లి: వైద్యం కోసం వచ్చిన వారిపై వైద్యాధికారులు చూపిస్తున్న తీరును పేషంట్లు అసంతృప్తి వ్యక్తం చేస్తూ నిరసన చేపట్టారు. నేలకొండపల్లి సీహెచ్‌సీకి సోమవారం బాధితులు పొటెత్తారు. సింగారెడ్డిపాలెంకు చెందిన కోటయ్య, అనాసాగారంకు చెందిన మరొకరు, నేలకొండపల్లికి చెందిన మరో పేషెంట్ కడుపు నొప్పితో వచ్చారు. ఈనేపథ్యాన వారిని ఖమ్మంకు రిఫర్ చేయడంతో సమయానికి 108 లేకపోవడంతో పేషెంట్ల బంధువులు స్థానిక వైద్యాధికారులు, సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. సమయానికి 108 ఉండదు, స్కానింగ్ లేదు, ఎక్స్‌రే ఉండదు.. ఏ చిన్నదానికైనా ఖమ్మం రిఫర్ చేస్తే మీరెందుకు అంటూ ప్రశ్నించారు. ఈ నేపథ్యాన ఓ వైద్యాధికారి కలుగజేసుకొని మాట్లాడడంతో మరింత ఉద్రిక్త నెలకొంది. చివరకు 108 రావడంతో ఆ ఇద్దరి పేషెంట్లను ఖమ్మం పంపించారు. ఈ విషయమై సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మంగళను వివరణ కోరగా.. విషయం తన దృష్టికి రాలేదన్నారు. వివరాలు తెలుసుకుని ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూస్తానని చెప్పారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం..

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రభుత్వం తక్షణమే విద్యార్థుల పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకుండా వారి జీవితాలతో చెలగాటం ఆడొద్దని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గత ఆరేళ్లుగా ఫీజులు విడుదల చేయకపోవడం వలన ఉన్నత చదువులకు వెళ్లేవారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పేద విద్యార్థులు అప్పులు చేసి మరీ సర్టిఫికెట్లు తీసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మరో పక్క కళాశాలల యాజమాన్యాలు అప్పులు తెచ్చి నడిపిస్తున్నామని, జీతాలు చెల్లించలేమని ఈ రోజు నుంచి కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చాయని తెలిపారు. దీనిని ప్రభుత్వం యాజమాన్యాలతో చర్చించి పేద విద్యార్థులకు నష్టం లేకుండా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షాన రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

వరద బాధితుడికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న ప్రతినిధులు

నేలకొండపల్లి: ఖమ్మం మున్నేరు వరద బాధితుడికి పూర్వ విద్యార్థులు ఆర్థిక సహాయం ను అందించి అండగా నిలిచారు. మండలంలోని రాజేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన(1986–87 బ్యాచ్) పదో తరగతి పూర్వ విద్యార్థి జానీపాషా ఖమ్మం జలగంనగర్‌లో నివాసముంటుండగా.. ఇటీవల వచ్చిన వరదలతో సర్వం కోల్పోయాడు. విషయం తెలుసుకున్న నాటి పూర్వ విద్యార్థులు కలిసి రూ.25,116 నగదు జమ చేసి సోమవారం జానీపాషాకు అందించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు అడపాల రామారావు, సత్యనారాయణరెడ్డిలు మాట్లాడగా.. పూర్వ విద్యార్థులు వజ్జా కిషోర్, సత్యవతి, హైమావతి, కృష్ణమూర్తి, టి.నాగేశ్వరరావు, సలవాది వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబా మృతికి సంతాపం


ఖమ్మంలీగల్: నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

ఖమ్మం లీగల్/కూసుమంచి: ప్రజలకోసం జీవితాన్ని త్యాగం చేసిన ఉన్నత విద్యావంతుడు ప్రొఫెసర్ సాయిబాబా మరణం హక్కుల ఉద్యమాలకు తీరని లోటని ఖమ్మంలోని పలు న్యాయవాద సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మృతికి నివాళులర్పించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, బిచ్చాల తిరుమల రావు, షేక్.లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు, మేకల సుగుణరావు, న్యాయవాదులు పాల్గొన్నారు. అలాగే అనారోగ్యంతో మృతిచెందిన సాయిబాబా మరణానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ.వెంకన్న డిమాండ్ చేశారు. సోమవారం కూసుమంచిలో కార్మికులతో కలిసి సాయిబాబాకు నివాళులర్పించారు. మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయనే నెపంతో జైలులో మగ్గేలా చేసి ఆయన మరణానికి కారణమయ్యారని కేంద్రాన్ని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మిక నాయకులు పాల్గొన్నారు.

కూలీల సమస్యలు పరిష్కరించాలి

కామేపల్లి: వ్యవసాయ కూలీల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బాదావత్ శ్రీనివాస్ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని మద్దులపల్లి గ్రామంలో వ్యవసాయ కూలీలు,దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించేందుకు కృషి చేయాలని, గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ నివాస ప్రాంతాల్లో రహదారులు, సీసీ రోడ్లు నిర్మించాలని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం కింద ఉన్న నిధులను ఆ ప్రాంతాల అభివృద్ధికే కేటాయించి అభివృద్ధిపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో మంగీలాల్, లక్ష్మీనారాయణ, నారాయణ, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం ఏర్పాటు చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సురేష్

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం శివారు వరంగల్ క్రాస్‌రోడ్‌లో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం యూత్ కాంగ్రెస్ పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్యా సురేష్‌నాయక్ తహసీల్దార్ బి.రాంప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. మండలంలో గ్రంథాలయం లేక ఏడు కిలోమీటర్ల దూరంలోని ఖమ్మం అర్బన్ మండలానికి వెళ్లాల్సి వస్తోందని, దీంతో పోటీ పరీక్షలకు సరిగా ప్రిపేర్ కాలేకపోతున్నారని పేర్కొన్నారు. నిరుద్యోగ యువత ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే గ్రంథాలయ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏఈ డిప్యూటేషన్ రద్దు చేస్తూ ఉత్తర్వులు

ఖమ్మంమయూరిసెంటర్: కేఎంసీలో అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)గా విధులు నిర్వర్తిస్తున్న శ్యామ్ మనోహర్ డిప్యూటేషన్‌ను రద్దు చేస్తూ మాతృశాఖ హౌసింగ్ కార్పొరేషన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. హౌసింగ్ కార్పొరేషన్‌ను పునరుద్ధరించడంతో ఆ శాఖలో గతంలో ఏఈలుగా పని చేసి, ఇతర శాఖలకు డిప్యూటేషన్‌పై వెళ్లిన ఎనిమిది మందిని తిరిగి శాఖలోకి తీసుకుంటూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో త్వరలోనే శ్యామ్ మనోహర్‌ను కేఎంసీ నుంచి రిలీవ్ చేయనున్నట్లు చర్చ జరుగుతుంది.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


తిరుమలాయపాలెం: జూపెడలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఓ సీతారాంరెడ్డి


నేలకొండపల్లి: చెరువుమాధారంలో ప్రారంభిస్తున్న ఎంపీడీఓ యర్రయ్య

తిరుమలాయపాలెం/నేలకొండపల్లి: తిరుమలాయపాలెం మండలంలోని జల్లెపల్లి, జూపెడ గ్రామాలు, నేలకొండపల్లి మండలం చెరువుమాధారం గ్రామాల్లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించారు. జల్లెపల్లిలో పీఏసీఎస్ తిరుమలాయపాలెం, జూపెడలో ఐకేపీ, చెరువుమాధారంలో ఐకేపీ ఆధ్వర్యాన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తిరుమలాయపాలెంలో తహసీల్దార్ పీ.వీ.రామకృష్ణ మాట్లాడుతూ.. ధాన్యం రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సీతారాంరెడ్డి ఎంపీడీఓ సిలార్‌సాహెబ్, ఎంపీఓ సూర్యనారాయణ ఐకేపీ అధికారులు, ఏఈఓలు పాల్గొన్నారు. అలాగే చెరువుమాధారంలో ఎంపీడీఓ ఎం.యర్రయ్య ప్రారంభించి మాట్లాడుతూ.. మండలంలో మొత్తం 22 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనుండగా.. దొడ్డు రకం కోసం అనాసాగారంలో కేంద్రాన్ని ఏర్పాటు చేయగా, గువ్వలగూడెంలో కూడా కొనుగోళ్లు ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జె.మానిక్‌రావ్, మండల వ్యవసాయాధికారి డి.అరుణకుమారి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆలస్యం మధుసూదన్‌రావు, ఐకేపీ ఏపీఎం ఆశోక్ రాణి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలి


ట్రాఫిక్ ఏసీపీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: పాత సీపీఎం ఆఫీస్ రోడ్డును(ఆంధ్రా బ్యాంక్)ను వన్‌వేగా చేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీకి సీపీఎం నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్ మాట్లాడుతూ కొత్త బస్టాండ్, గట్టయ్యసెంటర్ వైపు నుంచి పాత బస్టాండ్, రైల్వేస్టేషన్‌కు వెళ్లే వాహనదారులు అంతా సరితాక్లినిక్ సెంటర్ మీదుగా పాత సీపీఎం ఆఫీస్ రోడ్డున ప్రయాణిస్తుండడంతో వాహనదారులు ఎదురెదురుగా వచ్చి ట్రాఫిక్ జామ్ అవుతుందన్నారు. దీంతో వాహనదారులతో పాటు ఆస్పత్రులకు వచ్చే బాధితులూ అవస్థలు పడుతున్నారని, వెంటనే ఈ సమస్యకు ప్రత్యామ్నాయ మార్గం చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం టూటౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు ఉపేందర్, సీహెచ్.భద్రం, బి.సాగర్, గుమ్మడి భిక్షం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ


పూజలో పాల్గొన్న నామ నాగేశ్వరరావు

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురం మధుకాన్ షుగర్ అండ్ పవర్ ఇండ్రస్టీస్‌లో సోమవారం రాత్రి అయ్యప్ప మహాపడి పూజ నిర్వహించారు. ఫ్యాక్టరీ ఎండీ నామ కృష్ణయ్య స్వామి నేతృత్వంలో పాకతిల్లం నారాయణ నంబూద్రి గురుస్వామి ఆధ్వర్యాన గణపతి, సుబ్రహ్మణ్యం, అయ్యప్పస్వామికి పుష్పాలంకరణ, విద్యుత్ కాంతులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పడి పూజకు డప్పు శ్రీను గురుస్వామి ఆలపించిన అయప్ప స్వామి పాటలు భక్తులందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. మాలధారణ పొందిన వారు భక్తిశ్రద్ధలతో పూజలో పాల్గొని దైవానుగ్రహం పొందాలని ఆకాంక్షించారు. ఈ దీక్షలు భక్తులను ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దుతాయన్నారు. పూజలో పాల్గొని విజయవంతం చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. పూజలు చేశారు. కార్యక్రమంలో నామ సోదరులు రామారావు, సీతయ్య, కుటుంబ సభ్యులు, చెరుకు రైతులు, ఫ్యాక్టరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ నూతన కార్యవర్గం ఎన్నిక



నగర నూతన కమిటీతో టీఎన్జీవోస్ నాయకులు

ఖమ్మం సహకారనగర్: టీఎన్జీవోస్ జిల్లా అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యాన సోమవారం ఖమ్మం నగర యూనిట్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాయల నరసింహారావు ఎన్నికల అధికారిగా వ్యవహరించగా కార్యవర్గం ఏకగ్రీవమైనట్టు ప్రకటించారు. ఈమేరకు అధ్యక్షుడిగా చంద్రకాని రమణయాదవ్, కార్యదర్శిగా పోలవరపు వీరాంజనేయులు, కోశాధికారిగా కొప్పుల దిలీప్ ఎన్నికయ్యారని తెలిపారు. అలాగే, సభ్యులుగా ఎం.డీ.రఫీ, నెల్లూరి రవికుమార్, ఎం.శ్వేత, కె.ప్రసన్నకుమార్, వి.శంకర్‌రావు, టి.కాంతారావు, ఐ.కిరణ్ కుమార్, ఎం.ఉదయ్‌భాస్కర్, ఎస్.శ్రావణి, ఎన్.పృధ్వీ, కెకె.పవన్ కుమార్, సీహెచ్.ప్రవీణ్ ఎన్నికయ్యారు. మూడేళ్ల పాటు అమల్లో ఉండే ఈ కమిటీని టీఎన్జీవోస్ జిల్లా కోకన్వీనర్ కొణిదెన శ్రీనివాస్, నాయకులు జైపాల్, గంగవరపు బాలకృష్ణ, గుంటుపల్లి శ్రీనివాస్, కొమరగిరి దుర్గాప్రసాద్, రమేష్, ప్రకాష్, తాళ్లూరి శ్రీకాంత్, బుసా చంద్రశేఖర్, పెద్దినేని రాధాకృష్ణ అభినందించారు.

ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యాన ధర్నా


ధర్నా చేస్తున్న హమాలీలు, నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: నగరంలోని ఎఫ్‌సీఐ గోడౌన్‌లోకి పని గుర్తింపు కార్డులు ఉన్నా హమాలీలను అనుమతించకపోవడాన్ని నిరసిస్తూ ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) ఆధ్వర్యాన సోమవారం ధర్నా నిర్వహించారు. ఎఫ్‌సీఐ గోడౌన్ గేటు ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు కొత్తా సీతారాములు మాట్లాడుతూ.. ఎఫ్‌సీఐలో పని కార్డులు ఉన్నా హమాలీలను అనుమతించపోవడం దారుణమన్నారు. ఈమేరకు అనుమతించని వారిపై చర్యలు తీసుకోవాలని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నగర అధ్యక్షుడు నరాల నరేష్‌నాయుడు, ఎండీ పాషా, గజ్జి సూరిబాబు, కె.భద్రం, ఎండీ ఫజల్, సైదుబాబు, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

రహదారుణం..!

కూసుమంచి: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు పలు గ్రామీణ రహదారులు గుంతలమయంగా మారాయి. దీంతో వాహనదారులకు ప్రయాణం సాగించేందుకు నరకయాతన అనుభవిస్తున్నారు. గత కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో గుంతల్లో వర్షపు నీరు నిలిచి ప్రమాదకరంగా మారాయి. వాహనదారులు ఆ గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారులపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని పలువురు కోరుతున్నారు.


నర్సింహులగూడెం-కొత్తూరు గ్రామాల మధ్య దెబ్బతిన్న రహదారి